జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజలకోసం

## కరీంనగర్

జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి

శుక్రవారం | 13 | ఫిబ్రవరి | 2026 | పేజీలు: 8



## మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ వద్ద మూడంచెల భద్రత బందోబస్తు

### పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం గురువారం తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తును మోహరించినట్లు ఆయన పేర్కొన్నారు.


2

# నేడే ఓట్ల లెక్కింపు

తేలనున్న భవితవ్యం..

ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్...

మధ్యాహ్నం వరకు ఫలితాలు వచ్చే అవకాశం..




మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటల నుంచి ఆరంభం కానున్నది. గెలుపోటములపై అభ్యర్థులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తుండగా, ఫలితాలు ప్రకటించిన వెంటనే గెలిచిన అభ్యర్థులు ఆయా పార్టీల నాయకులు క్యాంపులకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గెలుపుపై మూడు ప్రధాన పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

వివరాలు లోపలి పేజీలో...




4


## బిజెపి కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి

ప్రభుత్వ హాస్పిటల్ లో సార్వత్రిక సమ్మెను జయప్రదం.

# పట్టు ఎవరిదో?

- ఎమ్మెల్యే వర్సెస్ మాజీ ఎమ్మెల్యే..
- అభివృద్ధి నినాదం ఒకరిది...
- ఆత్మగౌరవ పోరాటం మరొకరిది ...

3



# మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ వద్ద మూడంచెల భద్రత

## పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం



**కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహిం చేందుకు కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం గురువారం తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా ఎటు వంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట మైన పోలీస్ బందోబస్తును మోహరించినట్లు ఆయన పేర్కొన్నారు. మొదటి గేట్ కేవలం పోలీసు అధికారు లు, మున్సిపల్ అధికారులు విధుల్లో ఉన్న సిబ్బందికి మాత్రమే అనుమతి ఉంటుంది అన్నారు,రెండవ గేట్ అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లు, మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ప్రవేశం కల్పించడమైనదని వీరందరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని పేర్కొన్నారు,ఓట్ల లెక్కింపు కేంద్రాల వైపు వచ్చే వాహనాల వల్ల ట్రాఫిక్ అంతరాయం కలగ కుండా ముందస్తుగా దారి మళ్లింపు చర్యలు చేపట్టామని జగిత్యాల-కరీంనగర్ మార్గంలో ప్రయా ణించే వారు పోలీసుల సూచనలు పాటించాల న్నారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వాహనాల కోసం నిర్ణీత దూరంలో ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించడ మైనదని రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద సంబరాలు లేదా నిరసనల పేరిట శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని. ఎటువంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, అవి పూర్తిగా నిషేధమని పోలీసు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సీపీ తెలిపారు.నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

**దారి మళ్లింపు :**

జగిత్యాల నుండి కరీంనగర్ వైపు వచ్చే వాహ నాలు జగిత్యాల నుండి కరీంనగర్ వైపు వచ్చే అన్ని రకాల వాహనాలను రేకుర్తి చౌరస్తా వద్ద మళ్లిస్తారు. ఈ వాహనాలు శాతవాహన యూనివర్సిటీ, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ రోడ్ మీదుగా చింతకుంట ద్వారా నగరంలోకి చేరుకోవాల్సి ఉంటుంది.కరీంనగర్ నుండి జగిత్యాల వైపు వెళ్లే వాహనాలు. నగరం నుండి జగి త్యాల వైపు వెళ్లే వాహనాలు తెలంగాణ చౌక్, రామ్ నగర్, పద్మనగర్, చింతకుంట మీదుగా కొత్తపల్లి పోలీస్ స్టేషన్ రోడ్, అక్కడి నుండి శాతవాహన యూనివర్సిటీ, రేకుర్తి చౌరస్తా మీదుగా జగిత్యాల వైపు వెళ్లాలని పోలీసులు సూచించారు.

# కాంగ్రెస్ అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలి..

## కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు

**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** కరీంనగర్ ఎస్ ఆర్ ఆర్ కళాశాలలో శుక్రవారం జరిగే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు సూచించారు. కౌంటింగ్ ప్రక్రియలో నియమ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అభ్యర్థులను కోరారు. గురువారం రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ "కౌంటింగ్ కేంద్రానికి కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థులు, ఏజెంట్లు శుక్రవారం ఉదయం ఆరు గంటల వరకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను పూర్తిగా అనుసరించాలన్నారు. ప్రతి రౌండ్‌ను జాగ్రత్తగా పరిశీలిస్తూ, ఎటువంటి సందేహాలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకు రావాలి," అని తెలిపారు. కౌంటింగ్ హాల్‌లో క్రమశిక్షణ పాటించడం అత్యంత అవసరమని ఆయన స్పష్టం చేశారు. అనవసర వివాదాలకు దూరంగా ఉండాలని, కౌంటింగ్ సిబ్బందితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.అభ్యర్థులు ఏజెంట్లు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని, అనుమతించిన నియమాల మేరకు మాత్రమే వ్యవహరించాలని వెలిచాల రాజేందర్ రావు అన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిం చాలని రాజేందర్ రావు కోరారు.

# కౌంటింగ్ ఏర్పాట్ల ప్రక్రియ పూర్తి

## నగర పాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** నగరపాలక సంస్థ 66 డివిజన్ కు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. నగరపాలక సంస్థ 2 వ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం రోజు స్థానిక ఎస్ ఆర్ ఆర్ కళాశాలలో కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, సీపి గౌస్ ఆలం సమక్షంలో మాస్టర్ ట్రైనర్లు కౌంటింగ్ అధికారులు సిబ్బంది కి శిక్షణ నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులకు సిబ్బంది కి ఓట్ల లెక్కింపు విధి విధానాల పై దిశా నిర్దేశం చేశారు. ఓట్ల కౌంటింగ్ ప్రక్రియలో పాటించాల్సిన నిబంధనల పై పలు సూచనలు చేస్తూ... ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... నగరపాలక సంస్థ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎన్నికల సంఘం నియమ నిభందనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ సర్వం సిద్ధం చేశామని తెలిపారు. స్థానిక ఎస్ ఆర్ ఆర్ కళాశాల ఇండోర్ స్టేడియంలో శుక్రవారం రోజు ఉదయం 66 డివిజన్లకు సంబంధించిన ఓట్ల లెక్కింపు 8:00 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ సుపర్ వైజర్లు, అసిస్టెంట్ సూపర్ వైజర్లు కలుపుకొని మొత్తం 300 మంది కౌంటింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ కోసం కావల్సిన వసతి సౌకర్యాలు అన్ని కల్పించామన్నారు. పోలీస్ భారీ బంధోబస్తు మద్య ఓట్ల లెక్కింపు జరుగుతుందని స్పష్టం చేశారు. కౌంటింగ్ సెంటర్ లో మొత్తం 66 టేబుల్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని... మొదటగా ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్లను లెక్కించడం జరుగుతుందని... తదనంతరం బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందని తెలిపారు. 1000 ఓట్లకు ఒక రౌండ్ చొప్పున పలితాలను వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కౌంటింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన



**ఎండపల్లి, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** మండలంలోని చర్లపల్లి గ్రామంలో గురువారం రోజున సన్ రైజ్ ఆసుపత్రి నిర్వహణలో,గ్రామ సర్పంచ్ పడిదం లావణ్య మొగిలి సౌజన్యంతో గ్రామ ప్రజల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు,ఈ శిబిరంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికీ వైద్యులు వైద్య సిబ్బంది, బి.పి.షుగర్,గుండె సంబంధమైన ఇసిజి,ఇతర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అలుగం తిరుపతి,వార్డు సభ్యులు, జిల్లా శ్రీనివాస్ సిగిరి నగేష్ పిఎంపి అనంత చారి మాదాసు గంగాధర్ ,గ్రామస్తులు యువత పాల్గొన్నారు.

# గుండెపోటుతో అంగన్వాడీ టీచర్ మృతి





**సారంగాపూర్ మండలం, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** సారంగాపూర్ మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ అమిదిపురం అన్నపూర్ణ గురువారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. చాలా సంవత్సరాల నుంచి గ్రామంలో అంగన్వాడీ టీచర్గా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే అన్నపూర్ణ టీచర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అంగన్వాడీ టీచర్ గా గత 36 సంవత్సరాలుగా పనిచేస్తున్న అన్నపూర్ణ అకాల మరణం చెందారు. మరణానికి గాను ప్రభుత్వం నుండి అందవలసిన మట్టి ఖర్చులు 20,000/- రూపాయలను జిల్లా సంక్షేమ అధికారి రాజకుమార్ తక్షణమే స్పందించి సిడిపిఓ వాణిశ్రీ , అంగన్వాడి సూపర్వైజర్ లత ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది.

# గ్రామంలో రహదారి శుభ్రపరిచే పనులు ప్రారంభం



**మెట్‌పల్లి, ఫిబ్రవరి 12(ప్రజాజ్యోతి):** మండలం లోని వేంపేట్ గ్రామంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో తొలగించి రహదారిని చదును చేసే పనులు చేపట్టారు. గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు గ్రామ పంచాయతీ వర్గాలు తెలిపాయి. అలాగే రహదారి ప్రక్కన లోతుగా ఉన్న ప్రాంతాల్లో వాహనాలు స్కిడ్ కాకుండా ఉండేందుకు మొరం పోయించే పనులు కూడా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ పనులను పరిశీలించేందుకు మెట్‌పల్లి ఎంపీడీఓ సురేష్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వేంపేట్ గ్రామ సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ అల్లూరి సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజు, వార్డు సభ్యుడు గోరుమంతుల రఘు తదితరులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి పనులు నిరంతరం కొనసాగు తాయని, ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎంపీడీఓ సురేష్ తెలిపారు.

Karimnagar Pages_dummy kmr.qxd 13-02-2026 05:06 Page 3



# జగిత్యాలలో పట్టు ఎవరిదో?

- ఎమ్మెల్యే వర్సెస్ మాజీ ఎమ్మెల్సీ
- అభివృద్ధి నినాదం ఒకరిది
- ఆత్మగౌరవ పోరాటం మరొకరిది



**జగిత్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 12(ప్రజాజ్యోతి):** జగిత్యాల కాంగ్రెస్ పార్టీలో గత కొంతకాలంగా కొనసాగుతున్న రాజకీయ పరిణామాలు ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల వేల అత్యంత ఆసక్తికరంగా మారాయి. ఎమ్మెల్యే సంజయ్ కుమార్, సీనియర్ నేత జీవన్ రెడ్డి మధ్య నడుస్తున్న ఈ వర్గ పోరు ఈ మున్సిపల్ ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపుతు ఒదనే అంశం ఆసక్తి నెలకొంది, మున్సిపల్ ఎన్నికల వేళ జగిత్యాల రాజకీయాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి, దశాబ్దాల కాలం పాటు ప్రత్యర్థులుగా ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి ఇప్పుడు ఒకే గొడుగు (కాంగ్రెస్) కిందకు చేరినప్పటికీ, వారి మధ్య ఉన్న 'కోల్డ్ వార్' మాత్రం చల్లారలేదు. మున్సిపల్ ఎన్నికల వేల పార్టీ శ్రేణుల్లో అయోమయానికి గురి చేశాయి, బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సంజయ్ కుమార్ తన పట్టు నిలుపుకోవాలని చూడగా, జిల్లాలో కాంగ్రెస్ అంటేనే తానై వ్యవహరించిన జీవన్ రెడ్డి తన ప్రాధాన్యత తగ్గకూడదని భావించారు,కానీ కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయంతో 35-15 ఫార్ములాతో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పై చేయి సాధించారు, దీంతో సీనియర్ నేత జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో తన అనుచరులను స్వతంత్ర అభ్యర్థులగా పోటీలో నిలిపారు. అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థుల తరఫున ప్రచారం కూడా చేశారు, జగిత్యాలలో రెబెల్ అభ్యర్థుల పోటీతో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర ప్రభావం పడిందని నాయకులు అంటున్నారు, ప్రచార సమయంలో జీవన్ రెడ్డి తన ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారని ,ఈ వయసులో నన్ను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజల మధ్య కన్నీరు పెట్టుకున్నారు, దీంతో ప్రజలలోకొంత సానుభూతి జీవన్ రెడ్డి వచ్చినట్లు సమాచారం, ఇది ఎంతవరకు ఓట్ల రూపంలో ఉంటుందో చూడాలి. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తను గతంలో చేసిన అభివృద్ధి గురించిచెప్పుతూ, అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తున్నామని, జగిత్యాల అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించా లని ప్రజలను కోరారు, మొత్తానికి జగిత్యాల రాజకీయంలో నేతల మధ్య వైరం కాంగ్రెస్ పార్టీకి ఎంతవరకు నష్టం కలుగుతుందో వేచి చూడాలి ,వీరిద్దరి మధ్య వైరం టిఆర్ఎస్, బిజెపి పార్టీలకు ఎంతవరకు కలిసొస్తుందని రేపు కౌంటింగ్ తర్వాత తెలుస్తుంది. చైర్మన్ ఎన్నికకు స్వతంత్ర అభ్యర్థులే కీలకమా... కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి తన అనుచరులు దాదాపుగా 35 మంది స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దింపారు, వారి తరఫున జీవన్ రెడ్డి ప్రచారం కూడా చేశారు, అలాగే ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనుచరులు ,మాజీ బిఆర్ఎస్ కౌన్సిలర్లు టికెట్ రాకపోవడంతో వారు కూడా స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారని, వారికి కూడా ఎమ్మెల్యే సహాయ సహకారాలు అందించారని అంటున్నారు ,మొత్తానికి జగిత్యాల మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నికకుస్వతంత్ర అభ్యర్థులే కీలకంగా మారన్నారు ,మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి జగిత్యాల కోటను కాపాడుకోవడం కాంగ్రెస్‌కు మాత్రం అత్యవసరం.

# కోరుట్ల 31వ వార్డులో మార్పు తథ్యం..!

## బీఆర్ఎస్ అభ్యర్థి ఎలుగూరి శ్వేత కిరణ్ ధీమా



**కోరుట్ల, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** కోరుట్ల పట్టణంలోని 31వ వార్డులో ఈసారి మార్పు తప్పదని, ప్రజల తీర్పు బీఆర్ఎస్ వైపే ఉందని పార్టీ అభ్యర్థి ఎలుగూరి శ్వేత కిరణ్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ అనంతరం ఆయన మాట్లాడుతూ, 31వ వార్డులో ప్రజలు చూపిన స్పందన చారిత్రాత్మకమని పేర్కొన్నారు. పోలింగ్ రోజున అన్ని వర్గాల ప్రజల నుంచి లభించిన అపూర్వ మద్దతు తమ విజయానికి నిదర్శనమని తెలిపారు. యువత, మహిళలు, కార్మికులు, పేదలు, మధ్యతరగతి ప్రజలు ఒక్కటై బీఆర్ఎస్‌కు ఓటు వేశారని అన్నారు. ఈసారి 31వ వార్డులో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇన్నాళ్లుగా నిర్లక్ష్యానికి గురైన వార్డు అభివృద్ధి అంశాలపై ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని శ్వేత కిరణ్ అన్నారు. ప్రజలకు చేసిన అన్యాయానికి, తీరని సమస్యలకు ఈ ఎన్నికలే గుణపాఠమని వ్యాఖ్యానించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ప్రతి సమస్యపై పోరాడతానని హామీ ఇచ్చారు. వార్డు అభివృద్ధే లక్ష్యంగా రాజకీయా లకు అతీతంగా పనిచేస్తానని, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ప్రజలతో నిరంతరం మమేకమై, అందరికీ అందుబాటులో ఉండే కౌన్సిలర్‌గా నిలుస్తానని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించి 31వ వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ సంకల్పమని పేర్కొంటూ, ఈ ఎన్నికల్లో ప్రజల తీర్పు బీఆర్ఎస్‌కే అనుకూలంగా ఉందని మరోసారి ధీమా వ్యక్తం చేశారు.

# సార్వత్రిక సమ్మెలో ఉపాధి హామీ కార్మికులతో నిరసన




**తంగళ్ళపల్లి , ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో ఉపాధి హామీ కార్మికులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీని కొనసాగించాలని రద్దు చేయాలని నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఉద్యోగ ఉపాధి భద్రత కల్పించాలని రైతు పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వాలని ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని 2025 విద్యుత్ సవరణ బిల్లు రద్దుకై ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకై కనీస వేతనాల పెంపుకై మతోన్మాదా కార్పొరేట్ రాజకీ యాలకు వ్యతిరేకంగా అమాలి కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటుపరం చేయకుండా ఉంచాలని తదితర డిమాండ్లతో నిరసన కార్యక్రమం జరిగింది ప్రధానంగా ఉపాధి హామీ పథకంలో దేశవ్యాప్తంగా 12 కోట్ల మంది పని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు మన రాజన్న సిరిసిల్ల జిల్లాలో 90 వేల మంది ఉపాధి కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు ఈ ఉపాధి హామీ 2005 లో వాపక్షాలు కాంగ్రెస్ ప్రవేశపెట్టగా గ్రామీణ ప్రాంతంలో వలసల నివారణకు పట్టెడు అన్నం దొరికే అవకాశం ఉన్న పథకం ఉపాధి హామీ పథకం ఈ పథకం 12 కోట్ల మంది పనిచేయగా ఈ పథకాన్ని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి ఈ పథకానికి లక్ష యాభై వేల కోట్ల బడ్జెట్ అవసరం ఉండగా కేవలం 85 వేల కోట్ల బడ్జెట్ తోటే కొనసాగించడం మూలంగా ఉపాధి హామీ కార్మికులకు సరైన వేతనాలు లేక సమయానికి బకాయిలు పెండింగ్ ఉండడం మూలంగా ఉపాధి హామీ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు అని తెలిపారు. తక్షణంగా విపిజి రామ్ చట్టాన్ని రద్దు చేయాలి ఉపాధి హామీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు గుంటి వేణు,మధ్యాహ్న భోజన పథకం జిల్లా కార్యదర్శి మీసం లక్ష్మణ్, సిపిఐ మండల నాయకుడు బాచుపల్లి శంకర్, రాజేందర్, బాలయ్య, రాములు, మల్లయ్య, శంకర్, ఆనందం, రవి, నరసయ్య, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# లండన్ నుంచి వచ్చి ఓటు.. కమిషనర్ అభినందన



**జమ్మికుంట, ఫిబ్రవరి 12 ( ప్రజాజ్యోతి ):** జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల సందర్భంగా లండన్ నుంచి కొక్కుల మాధురి స్వదేశానికి చేరుకొని తన ఓటు హక్కును వినియోగించడం విశేషంగా నిలిచింది.ప్రజాస్వామ్య పట్ల బాధ్యతతో విదేశాల నుంచి వచ్చి ఓటు వేసిన ఆమెను మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమని, దూర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ ఓటు హక్కును వినియోగించడం ప్రతి పౌరుడి బాధ్యత అని కమిషనర్ పేర్కొన్నారు.

# కార్మికుల లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

## సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె



**తంగళ్ళపల్లి, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** తంగళ్ళపల్లి మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ లను వెనక్కి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఒక్కరోజు ధర్నా మరియు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ, గ్రామపంచాయతీ కార్మిక జిల్లా అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్, సిఐటియు జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సూరం పద్మ,మండల అధ్యక్షుడు కాసాని రవీందర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, చంద్రయ్య, జానీ ఎల్లవ్వ, రణం పద్మ, అంజవ్వ, కనకవ్వ, పరశురాములు, నరసయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థినికి ఆర్థిక సహాయం

**కోనరావుపేట, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** కొనరావుపేట మండలం మర్తన్నపేట గ్రామనికి చెందిన గుమ్మడి కీర్తన సిరిసిల్లలోని ప్రైవేట్ కళాశాలలో ఎంపీసీ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి కాలేజీ ఫీజు చెల్లించలేని పరిస్థితిలో ఉన్న నిరుపేద విద్యార్థికి దాతృత్వంతో ఆర్థిక సహాయం అందించారు చదువుపై మక్కువతో ఉన్న విద్యార్థిని పరిస్థితి తెలుసుకున్న ఇదే గ్రామానికి చెందిన ముంద్రాయి సతీష్ కుమార్ 10,500 రూపాయలు ఆర్థిక సహాయంగా అందజేశారు ఈ సందర్భంగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువు ఆగకూడదనీ విద్య భవిష్యత్తుకు పునాది అని అన్నారు ఈ సహాయంతో విద్యార్థిని తన చదువును నిర్బంధం లేకుండా కొనసాగించగలుగుతానని తెలిపింది. సహాయం అందుకున్న విద్యార్థిని దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో మాజీ సర్పంచ్ వెన్నమనేని వంశీకృష్ణ ముంద్రాయి విజయ్ గ్రామస్తులు ఉన్నారు.



Karimnagar Pages_dummy kmr.qxd 13-02-2026 05:06 Page 4



# వ్యవసాయ పనిముట్ల పంపిణీ

### ఏఎంసీ చైర్మన్ షేక్ సబేరాబేగం...



**ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సహారా బేగం గురువారము వ్యవసాయ యాత్రిక పథకంలో భాగంగా 50 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేశారు .వ్యవసాయ శాఖ ద్వారా వచ్చిన రోటివేటర్స్ రెండు ,కేజీ వీల్స్ ఒకటి ,కల్టివేటర్ 1 ,తైవాన్స్ వేర్లురెండు ,బొప్పాపూర్ గ్రామ రైతువేదిక వద్ద పంపిణీ చేశారు. బొప్పాపూర్ గ్రామ సర్పంచి ఇల్లెందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి ,వైట్ చైర్మన్ గూడా టి రామ్ రెడ్డి , మండల సర్పంచ్ ఫోరం కన్వీనర్ దొమ్మాట నరసయ్య మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీశైలం ,వెంకటేశం ,ముకుందం లబ్ధిదారులు గ్రామ ప్రజలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శాతవాహన డైరీ ఆవిష్కరణ



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** శాతవాహన విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనంలో ఉపకులపతి ఆచార్య యు.ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్ కుమార్, ఓఎస్డి టు విసి డా.హరికాంత్, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర పరిపాలన అధికారులతో కలిసి డైరీని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వ విద్యాలయాన్ని విస్తరించేందుకు, ఉత్తర తెలంగాణలో మేలైన విద్యను అందించడంలో శాతవాహన విశ్వవిద్యాలయాన్ని ముందు వరుసలో నిలపడానికి ప్రయత్నం చేస్తున్నామని అభివృద్ధి బాటలో భాగంగా బోధన, బోధనేతర సిబ్బందితో కలిసి ముందుకు వెళ్తామన్నారు.ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. రమాకాంత్, ఆర్ట్స్& లా కళాశాల ప్రిన్సిపాల్ డా. పద్మావతి, పరీక్షల నియంత్రణ అధికారి డా. డి. సురేష్ కుమార్, అధ్యాపకులు డా. అబ్రరూల్ బకీ, డా. సరసిజ, ఆచార్య సుజాత, డా శ్రీవాణి, డా. జెయంతి, అసిస్టెంట్ రిజిస్ట్రార్స్ వై కిషోర్, ప్రసాద్, వివిధ విభాగాధిపతులు, డైరీ కమిటీ సభ్యులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

# పశువుల సంతా ప్రారంభం



**కొనరావుపేట, ఫిబ్రవరి 12 ( ప్రజాజ్యోతి ):** కొనరావుపేట మండల కేంద్రంలో గురువారం నాడు పశువుల సంతను ప్రారంభించరూ ఈ సందర్భంగా సర్పంచ్ మస్కూరి కాశీరామ్, మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో మేకలు గొర్లు పాడి గేదలు విక్రయానికి ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారని గ్రహించి మండల కేంద్రంలోనే పశువుల సంత ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ కార్యక్రమం చేపట్టమని అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జింక రేవతి, కరుణాకర్, వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి సాయి, తదితర నాయకులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెకు మెట్‌పల్లిలో అంగన్వాడీల భారీ మద్దతు

## లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనం రూ.26 వేలు డిమాండ్






**మెట్‌పల్లి, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మెట్‌పల్లిలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన అంగన్వాడీ సిబ్బంది వ్యవసాయ మార్కెట్ యార్డులో సమావేశమై తమ డిమాండ్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బస్సు డిపో నుండి ఆర్డిఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్డిఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అంగన్వాడీ టీచర్ల సంఘం అధ్యక్షురాలు ఎం. సాయిస్వరి మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు, ఆయాలను ప్రభుత్వ ఉపాధ్యాయులుగా గుర్తించాలని, కనీస వేతనంగా రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసిన టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆరోగ్యలక్ష్మి మెనూ ఛార్జీలను పెంచాలని, హెల్త్ కార్డులు, పీఎఫ్, గ్రాట్యుటీ వర్తింపజేయాలని కోరారు. అర్హులైన అంగన్వాడీ టీచర్లకు సూపర్వైజర్ పదోన్నతులు ఇవ్వాలని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు సుతారి రాములు, ఎండి ఉస్మాన్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం కార్మిక వర్గానికి అన్యాయం అన్నారు. సుప్రీంకోర్టు పేర్కొన్న "సమాన పనికి సమాన వేతనం" సూత్రాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల అంగన్వాడీ టీచర్లు ఎం. భాగ్యలక్ష్మి, దయావతి, శారద, వనిత, పద్మ, మమత, సునీత, హిమగిరి, షమీం సుల్తానా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన సిబ్బంది, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులు కూడా సంఘీభావం ప్రకటించారు.

# బోలోరో డ్రైవర్ అదృశ్యం... పోలీసులకు ఫిర్యాదు



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** కదంబాపూర్ గ్రామానికి చెందిన కొడం రాజేష్ (32) అనే యువకుడు కనిపించకుండా పోయిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. రాజేష్ తండ్రి సత్యం. ప్రస్తుతం బోలోరో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 5వ తేదీ ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజేష్ తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై అతని తల్లి కొడం లత సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రాజేష్‌కు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినచో వెంటనే సుల్తానాబాద్ ఎస్‌ఐ (8712656511), సీఐ (8712656510) నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు

# సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ర్యాలీ



**కాల్వ శ్రీరాంపూర్, ఫిబ్రవరి 12 ( ప్రజాజ్యోతి ):** కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో గల ఆశ వర్కర్లు అంగన్వాడి వర్కర్లు హమాలీ కార్మికులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలను పరిష్కరించాలని. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ శంకరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని గురువారం రోజున అందజేశారు. కవిపిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రావణ్. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం జ్యోతి. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్. రైతు సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి. గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు దొడ్ల రాజబాబు. సిఐటియు మండల కార్యదర్శి అంబాల లక్ష్మణ్. రవి. మధునయ్య లతా. లక్ష్మినరసు. ఆశ వర్కర్లు. శారద .మౌనిక. స్వరూప. మమత .అంగన్వాడి టీచర్లు పద్మ. స్వరూప. సుమా. సుమలత .రజిత. ఆశ వర్కర్లు. హమాలి కార్మికులు పాల్గొన్నారు.

# బిజెపి కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి

- ప్రభుత్వ హాస్పిటల్ లో సార్వత్రిక సమ్మెను జయప్రదం.
- హాస్పిటల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బండారి శేఖర్




**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** గురువారం రోజున ప్రభుత్వ హాస్పిటల్ వర్కర్స్& ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పటల్ కార్మికులు మంచిర్యాల చౌరస్తా నుండి కోర్టు వరకు ర్యాలీ నిర్వహించి హాస్పటల్ వద్ద ధర్నా చేయడం జరిగింది. - అనంతరం యూనియన్ గౌరవ అధ్యక్షులు బండారి శేఖర్ మాట్లాడుతూ బిజెపి ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై టియుసిసి ట్రేడ్ యూనియన్ కో-ఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గౌరవ అధ్యక్షులు బండారి శేఖర్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కార్మికుల ఒక్క నెల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ హాస్పటల్ ఏజెన్సీల ను రద్దు




చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలి. కనీస వేతనం రూ.26,000/-లుగా నిర్ణయించాలి. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి. వి.బి.జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విత్తన చట్టాన్ని రద్దు చేయాలి. విద్యుత్ (సవరణ) బిల్లు - 2025 ను రద్దు చేయాలి. ఇన్సూరెన్స్ రంగంలో 100 % ఎఫ్‌ఎఐని రద్దు చేయాలి. ప్రభుత్వరంగ సంస్థలను, ప్రరిశ్ర మలను ప్రైవేటీకరించరాదని అన్నారు. ఎం.వి.యాక్ట్ - 2019 సవరించాలని తదితర డిమాండ్స్ తో సమ్మెలో పాల్గొంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రంలో యూనియన్ అధ్యక్షులు పి అరుణ్, కార్యదర్శి కళావతి, నాయకులు రాజు, స్వరూప, రాజయ్య, శేఖర్, సంపత్, రమేష్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిసిటీ అమెండ్మెంట్ బిల్‌కు వ్యతిరేకంగా

# జగిత్యాలలో విద్యుత్ ఉద్యోగుల నిరసన






**జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఎలక్ట్రిసిటీ అమెండ్మెంట్ బిల్ 2025 కు వ్యతిరేకంగా మరియు కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని జాతీయ విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి( ఎన్సీసీ ఓఈఈఈ) పిలుపు మేరకు టీజీపేజేఏసీ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా విద్యుత్ కార్యాలయం ఆవరణలో భోజనం విరామ సమయమున విద్యుత్ ఉద్యోగులు భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనలొ భాగంగా జేయేసి నాయకులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వెంటనే నిలిపి వేయాలని, ప్రైవేటీకరణ తొ ఇప్పుడు ఉన్న ఉద్యోగులకు తీవ్రమయిన అన్యాయం జరగడమే కాకుండ నిరుద్యోగులకి ప్రభుత్వ కొలువులు రావని చెప్పారు, అలాగే రైతులకి, సామాన్య ప్రజలకి విద్యుత్ చార్జీలు ప్రతి సంవత్సరం ఏప్రిల్ లో పెరుగుతాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న అన్ని సబ్సిడీలను క్రమ క్రమంగా ఎత్తి వేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 150 సంవత్సరాలు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలని రద్దు చేసి కోరలు తీసిన 4 చట్టాలను అమలు చేసిందని దీనివల్ల కార్మికులకి తీరని అన్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ నూతన కార్మిక వ్యతిరేక చట్టాలద్వారా కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని, పనిభారం తీవ్రంగా పెరుగుతుందని కార్మికుల సమస్యల పట్ల సంఘాలు గళమెత్తే అవకాశం కోల్పోతామని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసెంతవరకు వరకు మా నిరసనలు ఆగవని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో సుదర్శనం ఎస్ ఈ, డి ఈ లు అంజయ్య, గంగా రాం, మదసూదన్, గోపి కృష్ణ, ఎస్ ఏ ఓ శ్రీనివాస్, జేయేసి నాయకులు చేరాలు, ఆర్మూల్లా ప్రసాద్, రాంజీ, వరుణ్, జవహర్లాల్ నాయక్, సతీష్, ప్రవీణ్, ఆంజనేయులు, రహీమ్, అశోక్ రెడ్డి, భూమయ్య, అభీద్, అజీద్ పలు సంఘాల నాయకులు, విద్యుత్ ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధి హామీ ప్రారంభం



**ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండలం లో బాకూర్ పల్లె తండాలో ఉపాధిహామీ పనిని గ్రామ పరిధిలోని జ్వాలా బండ ప్రాంతంలో వందరోజుల పనులను ప్రారంభించిన అజ్మీరా రాజు నాయక్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామస్తులు జీవనోపాధి మరియు పడుతుందని పనులు భవిష్యత్తులో కూడా కొనసాగించబడతాయని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని వ్యవసాయ పనులు లేని సమయంలో ఈ పనులు జరుగుతున్నాయని వాటిని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోహన్ నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు ,వార్డు మెంబర్లు ప్రజా ప్రతినిధులు కూలీలు పాల్గొన్నారు.

## తిమ్మాపూర్ అంగన్వాడి తల్లిదండ్రుల కమిటీ సమావేశం

**ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో ఈరోజు ఉదయము అంగన్వాడీ సెంటర్లో తల్లిదం డ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి అందె సుభాష్ ఉపసర్పంచి జజ్జరి దేవేందర్ ,వార్డు సభ్యులు అంగన్వాడి కార్యకర్త మమత తల్లిదండ్రులు ఏఎన్ఎం ప్రవీణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణ పాల్గొన్నారు.



## జై సేవాలాల్ తండాలో అంగన్వాడిలో శ్రీమంతాలు



**ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి ):** ఎల్లారెడ్డిపేట మండలంలోని జై సేవాలాల్ తండా లో అంగన్వాడిలో తల్లిదండ్రుల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ భూక్య రజిత, గుండారం సర్పంచ్ మూడవ సరోజన ,పిల్లల తల్లిదండ్రులు సమావేశంలో కొత్తగా చైర్మన్ భూక్య రజిత ఎన్నుకున్నారు. తల్లుల కమిటీలో బాలింతలకు గర్భిణీ స్త్రీలకు పౌష్టికార గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్మెంట్ శిల్ప, ఏఎన్ఎంఎస్ ప్రవీణ కుమారి ,సువర్ణ ,ఆశా వర్కర్ సుజాత వాణి, గర్భవతులు తల్లిదండ్రులు బాలింతలు కిషోర్ బాలికలు ప్రైమరీ స్కూల్ హెచ్ఎం అజయ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరము ఇద్దరే తల్లులకు శ్రీమంతాలు చేయడం జరిగింది కమిటీ నిర్వాహకులు అంగన్వాడి భూక్య కల్యాణి తెలిపారు.

## యువతను ప్రోత్సహించే దిశగా క్రికెట్ బ్యాట్ అందజేత



**కొనరావుపేట, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి ):** కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామం లో యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందిం చేందుకు, ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో వేదాస్ సొల్యూషన్స్ సిరిసిల్ల ఆధ్వర్యంలో మోకానపెల్లి విజయ్ కుమార్ ,గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో నాలుగు వేల రూపాయల విలువగల క్రికెట్ బ్యాట్ ను సర్పంచ్ జిన్నా అనుష అనిల్ కుమార్, సన్నిహిద్యంలో యువ క్రీడాకారులకు అంద జేశారు సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ యువత క్రీడల్లో ముందుండాలని ఆకాంక్షించారు అలాగే గ్రామంలోని యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ప్రతిభను వెలికి తీయాలనే లక్ష్యంతో క్రికెట్ పై ఆసక్తి ఉన్న యువతకు క్రికెట్ బ్యాట్ పంపిణీ చేశామని తెలిపారు.

## మాతృవియోగంలోనూ.. మరువని పౌర బాధ్యత



**జమ్మికుంట, ఫిబ్రవరి 12 ( ప్రజాజ్యోతి ):** జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల రోజే ఎండీ ఇస్మాయిల్ తల్లి మ-రణించిన విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రజాస్వామ్య పట్ల తన బాధ్యతను నిర్వర్తిస్తూ ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ ముందుగా ఇస్మాయిల్ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. అనంతరం క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఓటు వేసినందుకు అభినందిస్తూ, ప్రజాస్వామ్యంపై ఆయనకు ఉన్న నిబద్ధతను ప్రశంసించారు.

## అంబటి మల్లన్న సేవలో శైలేంధర్ రెడ్డి



**ఎండపల్లి, ఫిబ్రవరి 12(ప్రజాజ్యోతి):** మండలం మారేడుపల్లి గ్రామంలో శ్రీ అంబటి మల్లన్న స్వామి పట్నాలు, జాతర మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల పిసిసి అధికార ప్రతినిధి తాటిపర్తి శైలేందర్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు,వీరి వెంట పలు గ్రామాల సర్పంచులు కొంగల జగదీశ్వర్ రెడ్డి సింగిరెడ్డి లింగారెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ పూదరి రమేష్ సోమిశెట్టి రమేష్ గుర్రాల శ్రావణ్ రెడ్డి ఎ ఏం సి డైరెక్టర్ పోలోజు శ్రీనివాస్ ఆలయ కమిటీ డైరెక్టర్ రాయకోటి సోషల్ మీడియా కోఆర్డినేటర్ మన్నే జితేందర్ గెల్లు శ్రీనివాస్ గుమ్మడి లక్ష్మీనారాయణ నేరెళ్ల బుచ్చయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



**జమ్మికుంట, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఇల్లందకుంట మండల కేంద్రంలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము మాట్లాడుతూ, లేబర్ కోడ్స్ ప్రధాన ఉద్దేశం దేశంలో కార్మికొద్యమాన్ని దెబ్బతీయడం ద్వారా పెట్టుబడికి దాని దోపిడీకి ఆటంకాలు లేకుండా చేయడం అని అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్మిక వర్గంపై పనిగంటల భారాన్ని పెంచుతూ కార్మిక జన సమూహాన్ని కట్టు బానిసలుగా పెట్టుబడు దారికి అనుకూలంగా మార్చుకోవాలని చూడటం అన్నారు. యూనియన్ల ఏర్పాట్లపై ఆంక్షలు: 1926 ట్రేడ్ యూనియన్ యాక్టివ్ ఈ లేబర్ కోడ్ మింగేసింది ఈ కోడ్ లోని సెక్షన్ 6 (2). 6(4) ప్రకారం యూనియన్ల రిజిస్ట్రేషన్ కిష్టతరమై కాదు దాదాపు అసంభవం చేస్తున్నాయి. ఇట్లాంటి చట్టాలు కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని వెంటనే ఈ చట్టాలను ఉపసర్వరించుకునే అంతవరకు పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు. పాల్గొన్న వారిలో సిఐటియు మండల అధ్యక్షులు రేనుకుంట్ల సారయ్య, మండల కార్యదర్శి శ్రీకాంత్, సంతోష్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కన్వీనర్ జముఖం వెంకన్న, కో కన్వీనర్ రావుల ఎల్లయ్య, గ్రామపంచాయతీ యూనియన్ గాదసిరి సంపత్, తోడం శ్రీనివాస్, సారయ్య, చంద్రయ్య, సత్తి, మధుకర్, రమేష్, సమ్మయ్య, రాజయ్య, వీరస్వామి, సాంబయ్య, శ్రీనివాస్, ఆనందం, కుమార్, శ్యామ్, తిరుపతి, పాల్గొన్నారు..

Karimnagar Pages_dummy kmr.qxd 13-02-2026 05:06 Page 6



## ప్రధాన మంత్రి ఉజ్వల ఉచిత గ్యాస్ సిలిండర్ లు పంపిణీ



**గంభీరావుపేట, ఫిబ్రవరి 12 ( ప్రజాజ్యోతి ):** గంభీరావుపేట మండలం నర్మల గ్రామంలో గురువారం రోజున ప్రధానమంత్రి ఉజ్వల ఉచిత గ్యాస్ పంపిణీ నీ గ్రామ సర్పంచ్ రాజబోయిన అర్చన బిజెపి నాయకులతో కలిసి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండలను పంపించేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజ బోయిన అర్చన మాట్లాడుతూ, కట్టెల పొయ్యిలతో కళ్ళలో నుండి నీరు కారడంతో అనేక అనారోగ్యం సమస్యలు వచ్చేవి దీనిని దృష్టిలో పెట్టుకొని ఆడ తల్లులపై దయ వుంచి ప్రధానమంత్రి ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్ ఇస్తున్నటువంటి నరేంద్ర మోడీ గారికి మా గ్రామ మహిళల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుదర్శన్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, వార్డు సభ్యులు బిజెపి బూత్ అధ్యక్షులు ఎల్లం, రాజు దేవా గౌడ్ చాత్ర బోయినరాజు, రాజేష్ చారి రాకేష్ రాజేష్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు




**జమ్మికుంట, ఫిబ్రవరి 12 ( ప్రజాజ్యోతి ):** జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసులకు సీఐ రామకృష్ణ గౌడ్ ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కఠినంగా అమలు చేయాలని, ఎలాంటి అవాంచ నీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. 100 మీటర్ల పరిధిలో గుంపులు గుమికూడకుండా చూడాలని,అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టాలని ఆదేశించారు.

## పెండ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడికి జైలు శిక్ష 15 వేల జరిమానా

**కాల్వ శ్రీరాంపూర్, , ఫిబ్రవరి 12 ( ప్రజాజ్యోతి ):** కాల్వ శ్రీరాంపూర్ మండలానికి చెందిన .ఓ యువతిని మంచిర్యాల జిల్లా దాస్పూర్ సిసిసికి చెందిన కొర్లపాటి అరుణ్ 37 సంవత్సరాల యువకుడు. పెండ్లి సంబంధాల కొరకు. క్రిస్టియన్ మ్యాట్రి మోనిలో ప్రొఫైల్ పెట్టగా. అది చూసిన అరుణ్ ఫోన్లో మాట్లాడుతూ. ఆమెను పెళ్లి చేసుకుంటానని. హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నానని .నెలకు 25 వేల జీతం వస్తుందని .ఆమెను హైదరాబాదుకు రప్పించుకొని. శరీరకంగా వాడుకొని .పెండ్లి నిరాకరించడంతో. బాధితురాలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు .అప్పటి సీఐ ఇంద్రసేనారెడ్డి విచారణ చేసి రిమాండ్ కు తరలించారు. తదుపరి నేర పరిశోధన పూర్తయిన పెద్దపల్లి జిల్లా కోర్టులో చార్జి సీటు దాఖలు చేశారు. కోర్టులో విచారణ జరిగింది. ఇరువురి వాదనలు జరిగాయి. అరుణ్ నేరస్తుడని తేలింది .జడ్జి కే.సునీత నేరాస్తుడికి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు .15 వేల రూపాయలు జరిమానా. విధించారు. నేరాస్థుడికి జైలు శిక్ష విధించడానికి. సహకరించిన. పబ్లిక్ ప్రాసిక్యూటర్డొంకెన మొగిలి కి .సాక్షులను ప్రవేశపెట్టి వాదనలను వినిపించి నేరాన్ని రుజువు చేయడం లో. కీలకపాత్ర పోషించిన .పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి .ఏసిపి. గజ్జికృష్ణ .సిఐ సుబ్బారెడ్డి. కాల్వ శ్రీరాంపూర్. ఎస్సై వెంకటేష్ .పోలీస్ సిబ్బంది పి శ్రీనివాస్ .పి కోటేశ్వరరావు లను. రామగుండం సిపి అభినందించారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది పాఠశాలలే

### కాళేశ్వరం జోన్ అధికారి సిహెచ్ గిరిజ




**ధర్మారం, ఫిబ్రవరి 12 ( ప్రజాజ్యోతి ):** మండలంలోని మల్లాపూర్ గురుకుల పాఠశాల కళాశాలలో గురువారం ఘనంగా వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాళేశ్వరం జోన్ అధికారి సిహెచ్ గిరిజ,డిసిఓ శ్రీనివాస్ హాజరు కాగా ప్రిన్సిపల్ అరుణ స్వాగతం పలికారు. పాఠశాలలోని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలు, గానం, నవ్వుల క్షణాలు గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులు తోటి వారి సమక్షంలో భావోద్వేగా పూరితమైన వీడ్కోలు ప్రసంగాలు చేశారు. అనంతరం విద్యార్థులు సీనియర్ విద్యార్థులకు జ్ఞాపకాలను గుర్తు చేస్తూ వారి భవిష్యత్తు విజయం కోసం శుభాకాంక్షలు తెలిపారు. జోనల్ అధికారి సిహెచ్ గిరిజ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ఈ సంవత్సరం పది,ఇంటర్ ఫలితాలలో 100% గ్రేడ్ తెచ్చుకొని పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని కోరారు. పరీక్షలకు ఎలా క్రికెట్ కావాలో సూచనలు చేశారు. విద్యార్థులు విద్యతో పాటు విలువలు నేర్పించిన ఉపాధ్యాయులకు ఎల్లవేళలా కృతజ్ఞతగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు చదువులు మాత్రమే కాకుండా సంస్కారాన్ని కూడా అలవర్చుకొని తోటి వారికి సహాఉపకారిగా ఉండటానికి ప్రయత్నిం చాలన్నారు.

ఈ సంవత్సరం వీడ్కోలు తీసుకుంటున్న విద్యార్థులకు ఇది ముగింపు కాదు కొత్త అధ్యాయనం ప్రారంభించాలని కోరారు. మల్లాపూర్ గురుకుల పాఠశాల 2025-26 గాను పీఎంశ్రీ లో రాష్ట్రస్థాయిలో ఎంపికవడం జరిగిందని ప్రిన్సిపల్ అరుణ తెలిపారు. అనంతరం వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ వైస్ ప్రిన్సిపల్లు అనూష,వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్ మోషన్ అలీ,పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ సుంచు మల్లేశం, ఉపాధ్యాయులు శ్రీలత,శ్వేత, రుసేంద్రమని, హేమ, విజయలక్ష్మి,అతియా ఫాతిమా, స్రవంతి, రజిత తదితరులు పాల్గొన్నారు.

## హీటేక్కిన క్యాంపు రాజకీయాలు..!

**వేములవాడ, , ఫిబ్రవరి 12 ( ప్రజాజ్యోతి ):** మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఫలితాలవిడుదలకు కొద్ది గంటల ముందు గురువారమే వేములవాడలో రాజకీయాలు హీటెక్కుతున్నాయి. ఫలితాల విడుదలకు కొద్ది గంటల ముందు గురువారమే వేములవాడలో రాజకీయాలు హీటెక్కుతున్నాయి. గెలుపుపై ధీమావ్యక్తం చేస్తూ కాంగ్రెస్పార్టీ 28 మంది అభ్యర్థులు గురువారం



సాయంత్రం క్యాంప్కు బయలుదేరి వెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాసంలో సమావేశం ఏర్పాటు చేసుకొని ఆయన సూచనల మేరకు అభ్యర్థులు కొద్ది సేపటి క్రితమే పార్టీ 28 మంది, అభ్యర్థులు, గురువారం సాయంత్రం క్యాంప్ కు బయలుదేరి వెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.. ఇప్పటికే ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్, నివాసంలో సమావేశం ఏర్పాటు చేసుకొని ఆయన సూచనల మేరకు అభ్యర్థులు కొద్ది సేపటి క్రితవే ప్రత్యేక బస్సులలో క్యాంపునకు బయలుదేరివెళ్ళారు. అయితేవీరు ఎక్కడికి వెళ్తున్నారు..? మళ్ళీ ఎప్పుడూ వస్తారు అనే సమాచారం తెలియాల్సిఉంది.

## విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

### సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి

**సుల్తానాబాద్,ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి ):** మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బైక్ ర్యాలీలు, డీజేలు, టపాకాయలు కాల్చడం వంటి కార్యక్రమాలకు అనుమతి లేదని సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై చంద్రకుమార్ స్పష్టం చేశారు. గెలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కాపాడేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వెలుపల 163 బీఎన్ఎస్-ఎస్ సెక్షన్ అమలులో ఉండగా, ప్రత్యేక భద్రతా ఏర్పాట్లతో పాటు క్యూ.ఆర్.టి బృందాలు, స్ట్రైకింగ్ ఫోర్సులు సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఫలితాల నేపథ్యంలో ప్రజలు, అభ్యర్థులు శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. అనుమతి లేకుండా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించే వారిని రిమాండ్కు పంపే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ర్యాలీలు లేదా ఊరేగింపులు నిర్వహించాలనుకుంటే సంబంధిత అధికారుల అనుమతి తీసుకుని వారు నిర్దేశించిన తేదీల్లో మాత్రమే జరపాలని చెప్పారు. ప్రజలందరూ శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపాడుతూ ఎన్నికల ఫలితాలను పరస్పర గౌరవంతో స్వీకరించాలని సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై చంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికల కౌంటింగ్ కు సర్వం సిద్ధం...

### పటిష్ట బందోబస్తు ఏర్పాటు

### ఎస్పీ అశోక్ కుమార్..

**జగిత్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 12(ప్రజాజ్యోతి):** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయసంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు భద్రతాపరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు మె-ుత్తం 450 మంది పోలీసు అధికారుల ,సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా స్థానిక ఫంక్షన్ హాల్లో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి ప్రత్యేక బ్రీఫింగ్ కార్యక్రమం నిర్వహించారు. కౌంటింగ్ రోజున చేపట్టాల్సిన భద్రతా చర్యలు, విధుల పై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన ప్రణాళిక, క్రమశిక్షణతో పనిచేయడం వల్ల పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో సహకరించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. కౌంటింగ్ ప్రక్రియ ఎన్నికలలో అత్యంత కీలకమైన దశ కావడంతో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కౌంటింగ్ హాల్ లోకి ఎలక్షన్ కమిషన్ ద్వారా జారీ చేయబడిన చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డులు కలిగిన సిబ్బంది, అభ్యర్థులు, వారి ఏజెంట్లను మాత్రమే అనుమతించాలని స్పష్టం చేశారు. ఎలాంటి అనుమతి లేని వ్యక్తులను కౌంటింగ్ హాల్లోకి అనుమతించకూడదని అన్నారు. అనుమా నాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పిలు వెంకటరమణ, రఘు చందర్, సి.ఐ లు,ఎస్.ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



Karimnagar Pages_dummy kmr.qxd 13-02-2026 05:06 Page 7



### కోనరావుపేటలో

# విద్యుత్ గ్రామపంచాయతీ కార్మికుల గర్జన

### విద్యుత్ సవరణ బిల్లు 2025ను రద్దు చేయాలి: రాష్ట్ర అధ్యక్షులు కె. ఈశ్వర్



**కొనరావుపేట, ఫిబ్రవరి 12 ( ప్రజాజ్యోతి ):** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ గ్రామపంచాయతీ కార్మికులు సెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో కోనరావుపేట మండల కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కర్నాల అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమ్మెకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లు 2025ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణ వల్ల సామాన్య ప్రజలపై భారంతో పాటు కార్మికుల భవిష్యత్తు అంధకార మవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.కార్మికుల పొట్టకొట్టే 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, నిలిపివేసిన ఎఫ్.టి.ఎ ని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఐటిఐ చదివిన కార్మికులను అసిస్టెంట్ హెల్పర్ అని పిలవడం సిగ్గుచేటని, వారిని వెంటనే జెఎల్ఎమ్ గా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నేతలు మాట్లాడుతూ.. సెస్ కార్మికులకు పదోన్నతులు కల్పించాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. 2025 సెప్టెంబర్ నుండి రావాల్సిన యాన్యువల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లను వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎల్లారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి విమల, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం, ఆశా వర్కర్ల సంఘం ప్రతినిధులు వరలక్ష్మి, జమున, గ్రామ పంచాయతీ సంఘం నేతలు గోపాల్, శ్రీనివాస్, హమాలీ సంఘం రాజు, సురేశ్, మధ్యాహ్న భోజన పథక సంఘం కవిత, వసంత మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు..



## కందనకుంటలో కుల బహిష్కరణ నిందితులపై కేసు నమోదు



**బీర్ పూర్, ఫిబ్రవరి 12(ప్రజాజ్యోతి):** జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలం కందనకుంట గ్రామంలో చోటుచేసుకున్న కుల బహిష్కరణ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన నాయకపు (ఎస్టీ) కులస్తుడైన ఏదుల రాజేశం (45) మరణించగా, ఆయన అంతిమ సంస్కారాల సమయంలో జరిగిన పరిణామాలపై గ్రామ పరిపాలన అధికారి ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. గ్రామ పరిపాలన అధికారి ఎస్.కె. రఫీ అహ్మద్ కథనం ప్రకారం.. అదే గ్రామానికి చెందిన కోమిరే పోశయ్య అనే వ్యక్తిని గతంలో కుటుంబ వ్యవహారాల కారణంగా కుల పెద్దలు బహిష్కరించారు. ఇటీవల ఏదుల రాజేశం మరణించగా, బహిష్కరణకు గురైన పోశయ్య అంతిమ సంస్కారాల్లో పాల్గొనేందుకు వచ్చారు. దీంతో ఆగ్రహించిన సంఘ కులస్తులు, పోశయ్య ఉన్నాడనే నెపంతో అంత్యక్రియలకు దూరంగా ఉండిపోయారు.

**పోలీసుల దర్యాప్తు:**

సామాజిక బహిష్కరణకు పాల్పడి, మానవ హక్కులకు విఘాతం కలిగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వీఆర్వో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీర్ పూర్ ఎస్సై రాజు స్పందిస్తూ.. కుల బహిష్కరణకు కారణమైన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. సామాజిక వివక్షకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## పురుగుల మందు తాగి మృతి

**సుల్తానాబాద్ , ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** సుల్తానాబాద్ మండలం రాముని‌పల్లి గ్రామానికి చెందిన ముడతనపల్లి చరణ్ (25) పురుగుల మందు తాగి చికిత్స పొందు తూ మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, చరణ్ హైదరాబాద్‌లో ఎంసీఏ చదువు పూర్తి చేసి కొంతకాలంగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. తనతో చదువు కున్న వారికి ఉద్యోగాలు లభించగా తాను ఉద్యోగం పొందలేక పోయినందుకు మనస్థాపానికి గురైనట్లు తెలిసింది. ఈ నెల 5వ తేదీన తమ పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగిన చరణ్‌ను కుటుంబ సభ్యులు వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. అక్కడి నుంచి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరా బాద్‌లోని రెనోవా ఆసుపత్రికి తరలించగా, కొద్ది రోజులుగా చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి సమయానికి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై మృతుడి తండ్రి ముడతనపల్లి సుధాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన చొప్పదండి జెడ్ పి హెచ్ ఎస్ విద్యార్థి

**చొప్పదండి, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** ఈనెల 13 వ తేదీ నుండి మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో జరిగే ఎస్ జి ఎఫ్ (స్కూల్ గేమ్ ఫెడరేషన్ )రాష్ట్రస్థాయి క్రికెట్ (అండర్ 17 ఇయర్స్) విభాగంలో పాల్గొనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) చొప్పదండి విద్యార్థి జి రామ్ చరణ్ (10వ తరగతి) ఎంపికైనాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డి తెలిపారు.

జనవరిలో సిరిసిల్లలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలో చక్కటి ప్రతిభ కనబరిచి కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటున్న విద్యార్థిని,శిక్షణ ఇచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె. కృష్ణ ను అభినందిస్తూ పాఠశాలలో విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.



## రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలకు పారమిత విద్యార్థుల ఎంపిక



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** జడ్చర్లలో ఈ నెల 13 నుంచి 26 వరకు తెలంగాణ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న 69వ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-17 (బాలుర) క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలకు స్థానిక పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు.పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి కె. విశ్వతేజ, 9వ తరగతి విద్యార్థి పి. కేదార్‌నాథ్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ కె. హన్మంతరావు తెలిపారు. ఇటీవల సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన అండర్-17 (బాలుర) ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో ఈ విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ డా ఇ. ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వి.యు.యం. ప్రసాద్, కె. హన్మంతరావు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, సమన్వయకర్త రబీంద్ర పాత్రో, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. రాజు, జి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు 250 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

**వేములవాడ, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):**



ఓట్ల లెక్కింపు సందర్భంగా 163 (144సెక్షన్అమలు), విజయోత్సవ ర్యాలీలు పూర్తిగానిషేధము, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవు , మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా సిరిసిల్ల, వేములవాడలలో ఏర్పాటు చేసిన కౌటింగ్ కేంద్రాల వద్ద 250 మంది పోలీస్ లతో పటిష్టబందోబస్తుఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. మున్సిపల్ ఓట్లలెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత నిర్వహిస్తున్నామని, ఎలాటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 163 (144 సెక్షన్ ) అమలుచేస్తున్నామన్నారు. ఎన్నికలు ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్, కండక్ట్ అమలులో ఉందని ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం గెలిచినఅభ్యర్థులు వారిఅనుచరులు విజయోత్సవర్యాలీలు ,సభలు, బైక్ర్యాలీలు నిర్వహించడం, డీజేకార్యక్రమాలు ఏర్పాటుచేయడం, టపాకాయలుకాల్చడం, భారీగా గుంపులు, గుంపులుగా గుమికూడటం, ఫంక్షన్ హాల్స్‌లో సమావేశాలు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధం అన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఆంక్షలను ప్రతిఒక్కరు తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన తీసుకుంటాని జిల్లాఎస్పీతెలిపారు..



# ఘనంగా అంబటి మల్లన్న స్వామి పట్నాలు, జాతర

## మల్లన్నను వేడుకున్న,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించిన సర్పంచ్ బాలసాని శారద, మల్లేశం



**ఎండపల్లి, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** అంగరంగ వైభవంగా అంబటి మల్లన్న స్వామి జాతర మహోత్సవం జరిగింది,సల్లంగా చూడు స్వామి అంటూ భక్తుల శరణు ఘోషలతో ఆలయ పరిసర ప్రదేశాలు ప్రతిధ్వనించాయి.ఎండపల్లి మండలం మారేడుపల్లిలో గురువారం రోజున అంబటి మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మాజీ సింగిల్ విండో చైర్మన్ మద్దుల గోపాల్ రెడ్డి హాజరై ప్రజలందరూ సుభిక్షంగా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అంబటి మల్లనను వేడుకున్నారు,జాతర ఉత్సవాల్లో భాగంగా ఉత్సవాలు భక్తులతో పోటెత్తింది.ఈ అంబటి మల్లన్నను వేడుకుంటే కోరిన కోరికలు



తీరుతాయని భక్తుల నమ్మకం, మండల ప్రాంతం ఉండే కాకుండా మూడు జిల్లాల నుంచి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనంతో జాతర పరిసర ప్రదేశాలు కిక్కిరిసిపోయాయి. ఆ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో మల్లన్న పట్నాలు వేయించి మొక్కులు చెల్లించుకున్నారు,కాగా భక్తులకు యాదవ సంఘం సభ్యులు ఏర్పాట్లు చేశారు,గ్రామ సర్పంచ్ బాలసాని శారద మల్లేశం అంబటి మల్లన్న పట్నాలకు, జాతర మహోత్సవానికి తరలివచ్చిన భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు , ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు పార్టీ నాయకులు కార్యకర్తలు పలు గ్రామాల ప్రజలు, భక్తులు, పాల్గొన్నారు,

---

## రాచర్లతిమ్మాపూర్ లో 5వార్డ్ మెంబర్ కోతుల కోసం వినూతల ప్రయోగం



**ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల తిమ్మాపూర్ లో తీవ్ర కోతుల బెడద తో ఇబ్బంది పడుతున్న ప్రజలను గమనించి ఐదో వార్డ్ మెంబర్ కన్నవేణి ప్రకాష్ కోతుల కోసం గెరిల్లా దుస్తులను ధరించి ఉదయం రెండు గంటలు సాయంత్రం రెండు గంటలు కోతులను పరిగెత్తి పరిగెత్తిస్తాడు. ఈ దృశ్యం ప్రజా జ్యోతి కంటపడగా వివరణ అడగగా ఎన్నికల్లో ప్రజలు ఓటు అడిగినప్పుడు కోతుల బెడద తీస్తావా అని ఓటర్ అడగగా పరిష్కారానికి కృషి చేస్తూ ఒక చిన్న ప్రయత్నం చేస్తున్నానని బదులిచ్చాడు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులు కోతులతో ఇబ్బంది పడుతున్నారని గేరెల్లా వేషధారణలో,కోతులను తరిమేస్తున్నామని ఇది ఒక చిన్న ప్రయత్నం గా చెప్పాడు.

---

## లొంకరామేశ్వరస్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ



**కథలాపూర్, ఫిబ్రవరి 12(ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని పోతారం గ్రామంలో ప్రసిద్ధ లొంకరామేశ్వరస్వామి వార్షిక జాతరకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఆలయ ప్రాంగణంలో గ్రామ సర్పంచ్ ధర్మపురి స్వప్న జలంధర్ ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లొంకరామేశ్వరస్వామి జాతర గ్రామ ప్రజల ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి సంవత్సరం భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందుతారని చెప్పారు. ఈసారి జాతరను మరింత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతర విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పులి హరిప్రసాద్, నరేష్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు గ్రామస్థులు పాల్గొన్నారు.

---

## రాజన్నపేటలో మద్యం అమ్మకాలను నిలిపి వేయాలని ఎక్సైజ్ సిఐకి వినతి పత్రం

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి , ఫిబ్రవరి 12 ( ప్రజాజ్యోతి ):** ఎల్లారెడ్డిపేట మండలం లోని రాజన్నపేట గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని అట్టి మద్యం అమ్మకాలను వెంటనే నిలిపివేయాలని ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సిఐ శ్రీనివాస్ కు రాజన్నపేట గ్రామస్తుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని గ్రామ నికి చెందిన ధ్యాప దేవయ్య గురువారం అందించారు.గ్రామంలో మద్యం విక్రయాలపై ఎక్సైజ్ అధికారులకు గతంలోఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా గ్రామంలోని రెండవ వార్డులో రెండు మద్యం దుకాణాలు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు అట్టి మద్యం దుకాణాలతో ప్రజలకు అన్యాయం జరుగుతుందని గ్రామంలో యువకులు, విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడే అవకాశంఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు సంబంధిత ఎక్సైజ్ అధికారులు తగు



చర్యలు తీసుకొని ప్రభుత్వ పద్ధతి ప్రకారం గ్రామాలలో అక్రమ మద్యం దుకాణాలు నిర్వహించకుండా చూడాలని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ను కోరారు.

---

## మేడిపల్లి తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశాలు

**మేడిపల్లి, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో 100 సీట్లకు, 7 నుంచి 10 తరగ తుల వరకు మిగిలిన సీట్లకు ప్రవేశ ప్రకటన వెలువడినది దీనికి గాను ఎస్సీ ,ఎస్టీ, బీసీ, విద్యార్థులు 125 రూపాయలు ఓసి, విద్యా ర్థులు 200 రూపాయలు చెల్లించి ఆన్లైన్లో అప్లై చేసుకోవలసి ఉంటు ందని ప్రిన్సిపల్ నాగ సుధారాణి తెలిపారు. అప్లికేషన్ ఆన్లైన్ సైట్, పూర్తి వివరాలకై పాఠశాల పని వేళల్లో, లేదా కింది సెల్‌నెంబర్‌కు ఫోన్ చేసి 8106192791 సంప్రదిం చగలరు.



---

## బహుజన సేన నాయకులు జింక శ్రీధర్

# పుట్టినరోజు సందర్భంగా లైబ్రరీకి రాజ్యాంగ పుస్తకాల అందజేత

**వేములవాడ, ఫిబ్రవరి 12 (ప్రజాజ్యోతి):** వేములవాడ పట్టణంలో గురువారం రోజున, బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ అధ్యక్షులు, జింక. శ్రీధర్, పుట్టిన రోజు సందర్భంగ వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ లైబ్రరీక ి రాజ్యాంగ పుస్తకాలను బహుజన రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బహుజన సేన రాజన్న సిరిసిల్ల ప్రధానకార్యదర్శి లక్కె.సాగర్ మాట్లాడుతూ దేశ ప్రజలందరూ భారత రాజ్యాం గంపై పూర్తి అవగాహన ెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాజ్యాంగం దేశప్రజలకు సమాన హక్కులు, స్వేచ్ఛలు కల్పించే మహత్తర



గ్రంథమని, దాని ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకుని కాపాడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. జింక శ్రీధర్ పుట్టినరోజును పురస్కరించుకుని సామాజిక బాధ్యతగా లైబ్రరీకి రాజ్యాంగ పుస్తకాలను అందజేయడం సంతోషకరమని తెలిపారు. యువత రాజ్యాంగ స్ఫూర్తిని తెలుసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుండా శ్యామ్, నేదురి శ్రీకాంత్,లక్కె దినాకర్, గుడిసె శశి, శ్రీను ఒక తదితరులు పాల్గొన్నారు.